క్లుప్తంగా

నేడు గంగాదేవీ తిరునాళ్లకు వేలం పాటలు

క్రోసూరు: అచ్చంపేట మండలం ఓర్వకల్లు గ్రామంలోని గంగాదేవీ పేరాంటళమ్మ ఆలయ తిరునాళ్ల ఫిబ్రవరి 12న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన లైసెన్సు హక్కుల వేలం పాట శనివారం నిర్వహిస్తున్నట్లు ఈవో ఎం.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ అధికారుల సమక్షంలో క్రోసూరులోని వీరభద్ర మల్లికార్జునస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు వేలం జరుగుతుందని పేర్కొన్నారు. తిరునాళ్ల ఫిబ్రవరి 11 నుంచి 13వ తేదీ వరకు, నెల పొంగళ్లు మార్చి 13 నుంచి 15వ తేదీ వరకు ఈ లైసెన్సులు పొందుతారని తెలిపారు. కొబ్బరి చిప్పలు, భక్తులు సమర్పించే చీరలు, జాకెట్ల సేకరణ, లడ్డూ ప్రసాదం, పూజా సామగ్రి విక్రయం, రంగులరాట్నం, చెప్పుల స్టాండ్ నిర్వహణకు వేలం పాటలు జరుగుతాయని పేర్కొన్నారు. హిందువులు వేలం పాల్గొనాలని, చెప్పుల స్టాండ్‌కు రూ.వెయ్యి, ఇతర హక్కులకు రూ.10 వేలు ముందుగా డిపాజిట్ చెల్లించాలని, పాడుకున్న వారు వెంటనే నగదు చెల్లించాలని తెలిపారు.

మోతాదులోనే ఎరువుల వినియోగం



నకరికల్లు: వరి నాట్లు చదరపు మీటరుకు 44 కుదుళ్లు ఉండేలా వేయాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులకు సూచించారు. రూపెనగుంట్ల, తురకపాలెం గ్రామాల్లో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరా వరి పంటకు 72 కేజీల నత్రజని, 36 కేజీల భాస్వరం, 24 కేజీల పొటాష్ ఎరువులను వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.దాసయ్య, ఎంపీడీఓ కె.హనుమంతరావు పాల్గొన్నారు.

సేవా లాల్ జయంతిని.. సెలవు దినంగా ప్రకటించాలి

అచ్చంపేట: లంబాడీల ఆరాధ్య దైవం, నాగరికత వైపు దారి మళ్లించిన మహోన్నత వ్యక్తి సంత్ శ్రీ సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని మాజీ ఎంపీపీ బాణావతు రామకోటేశ్వరరావు నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో ప్రతి జిల్లా కేంద్రంలో సేవాలాల్ జయంతి కార్యక్రమాలను నిర్వహించాల తెలిపారు. తెలంగాణాలో సేవాలాల్ జయంతి కార్యక్రమాలను ఏటా ఘనంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. సేవాలాల్ అనంతపురం వాసి అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని పేర్కొన్నారు.

ఈ నెల 21న జాబ్ మేళా

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్, సీడాప్, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో ఈ నెల 21న మాచర్లలో ఎస్‌కేబీఆర్ కళాశాలలో జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ తమ్మాజిరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం స్థానిక ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహించటం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రాంత యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాలో సుమారు నాలుగు కంపెనీలు పాల్గొంటాయన్నారు. మరిన్ని వివరాలకు ఆర్ కిరణ్ నాయక్ 7842747682, నైనిక్య 9010585360లను సంప్రదించాలన్నారు.

ద్విచక్ర వాహనం ధ్వంసం చేసిన దుండగులు

వెల్దుర్తి: మండలంలోని కొత్తపుల్లారెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ కేతావత్ పాండు నాయక్ ద్విచక్ర వాహనాన్ని అర్ధరాత్రి సమయంలో దుండగులు తీసుకెళ్లి ధ్వంసం చేసిన ఘటన గురువారం రాత్రి జరిగింది. పాండు నాయక్ తన ఇంటి వద్ద ద్విచక్ర వాహనాన్ని ఉంచి ఇంట్లో నిద్రపోతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆ ద్విచక్ర వాహనాన్ని అపహరించి ఊరికి కి.మీ దూరంలోని అటవీ ప్రాంతంలో ద్విచక్ర వాహనాన్ని రాళ్లతో పగులగొట్టారు. పాండు నాయక్ ఉదయాన్నే ఇంటి ముందు ద్విచక్ర వాహనం కనబడకపోవటంతో వెతకగా అటవీ ప్రాంతంలో వాహనాన్ని ధ్వంసం చేసినట్లు గుర్తించారు. పాత కక్షలు మనసులో పెట్టుకొని ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పాండు నాయక్ అన్నారు. ఈ విషయంపై పాండు నాయక్ వెల్దుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

దాచేపల్లి : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. నగర పంచాయతీ పరిధిలోని నడికుడికి చెందిన ఉప్పు వెంకటేశ్వర్లు(43) ఈ నెల 12వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకటేశ్వర్లు ఉపాధి నిమిత్తం గురజాలలో నివాసం ఉంటున్నాడు. నడికుడిలోని బంధువుల ఇంటి వద్దకు ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగివయనమయ్యాడు. నడికుడి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి దాటిన తరువాత ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డాడు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సమయపాలన పాటించాల్సిందే!

- సచివాలయ సిబ్బంది హాజరు యాప్‌లో నమోదు
- ఉదయం, సాయంత్రం నిర్ణీత సమయంలోనే..
- ఖజానా శాఖకు అనుసంధానం
- హాజరు తప్పితే సాధారణ సెలవుగా పరిగణలోకి



భృగుబండ గ్రామ సచివాలయ భవనం

సత్తెనపల్లి: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని, విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, ఆలస్యంగా వస్తూ త్వరగా వెళ్లిపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో గ్రామ/ వార్డు సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాల్సిందేనని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉద్యోగులు కొత్త యాప్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. దీంతో ప్రజలకు సచివాలయ సేవలు సక్రమంగా అందనున్నాయి.

రెండుసార్లు హాజరు నమోదు

సత్తెనపల్లి నియోజకవర్గంలో 75 సచివాలయాలు ఉన్నాయి. సచివాలయ ఉద్యోగులు మొబైల్ యాప్‌లో ఉదయం, సాయంత్రం హాజరు నమోదుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు యాప్‌లో కొన్ని మార్పులు చేసింది. డీఎస్ డబ్ల్యూఎస్ హాజరు యాప్ వెర్షన్ 2.2లో ఉదయం 10:30 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే హాజరు తీసుకుంటుంది. రోజుకు రెండుసార్లు బయోమెట్రిక్ లేదా ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంటుంది. ఎవరైనా ఉద్యోగి ఉదయం ఒకసారి హాజరు నమోదు చేసి, సాయంత్రం వేయకపోతే అది సాధారణ సెలవుగా పరిగణిస్తారు.

నియోజకవర్గంలో సచివాలయాలు

మండలం	సచివాలయాలు
సత్తెనపల్లి టౌన్	15
సత్తెనపల్లి రూరల్	19
ముప్పాళ్ల	13
రాజుపాలెం	14
నకరికల్లు	14
మొత్తం	75



ముఖాధారిత హాజరు నమోదు చేస్తున్న పట్టణ సచివాలయ ఉద్యోగి

ఖజానా శాఖకు అనుసంధానం..

గత ప్రభుత్వ హయాంలో బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేశారు. అది కూడా రెండు సార్లు హాజరు అమలు చేశారు. దీనిలో కొద్ది మార్పులు చేసి గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల హాజరు యాప్‌లో ప్రస్తుతం రోజుకు రెండు సార్లు విధిగా సమయపాలన పాటించి, హాజరు వేస్తేనే వేతనం వచ్చేలా ఖజానా శాఖకు అనుసంధానం చేసింది.

వీడని మంచు



క్రోసూరు: పొగ మంచు కమ్ముకుంటోంది. ఉదయం 7.30 గంటలకు కూడా మంచు తెరలు వీడడం లేదు. శుక్రవారం క్రోసూరులో ప్రధాన రహదారిని మంచు దుప్పటి చుట్టేసింది. చలి తీవ్రత తగ్గినప్పటికీ మంచు పొరలు వీడటం లేదు.

మార్చి 31లోగా పన్నులు వసూలు చేయాలి

- 100 శాతం లక్ష్యంగా పనిచేయాలి
- కమిషనర్ సూచన



మాట్లాడుతున్న కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట: పురపాలక సంఘానికి చెల్లించాల్సిన పన్నులు ప్రతి ఒక్కరూ మార్చి 31వ తేదీ లోగా 100శాతం చెల్లించే విధంగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ అతిథి గృహంలో సచివాలయ పరిపాలనా కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారితో పన్నుల వసూలుపై సమీక్ష చేశారు. ఆస్తి, ఖాళీస్థలాలు, నీటి పన్నులు బకాయిలు ఉన్న ప్రతి అసెస్‌మెంట్ యజమాని చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నూతనంగా నిర్మించిన, పాతభవనాలపై అదనంగా నిర్మించిన నిర్మాణాలను గుర్తించి పన్నులు విధించాలని సూచించారు. రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు బెయిలీబాబు, సయ్యద్ జహంగీర్ పాల్గొన్నారు.

నూజెండ్లలో ఆరోగ్య పింఛన్ల పరిశీలన

వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వం అందజేస్తున్న సామాజిక భద్రత పెన్షన్లలో అనర్హులు గుర్తింపుతో పాటు పునఃపరిశీలన కార్యక్రమం నూజెండ్ల మండలంలో శుక్రవారం ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు నెలకు రూ. 15 వేల పింఛను పొందుతున్న అనారోగ్య దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ పూర్తిస్థాయిలో మంచంలో ఉన్న లబ్ధిదారులను మాత్రమే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసినట్లు వైద్య బృందం సభ్యులు తెలిపారు. ఈవిధంగా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులు 14 మంది ఉండగా వైద్య బృందం సభ్యులు నేరుగా పింఛనుదారుల ఇళ్లకు వెళ్ళి పరిశీలించారు. వైద్య బృందం సభ్యులు విజయవాడ జీజీహెచ్ డాక్టర్ వరుణ్‌కుమార్, గుంటూరు జీజీహెచ్ వైద్యులు రోశయ్య, నూజెండ్ల వైద్యశాల వైద్యు లు పుష్పేంద్ర, డిజిటల్ అసిస్టెంట్ అమిత్‌మోహన్ తదితరులు ఉండగా నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

వైభవంగా పునీత అంతోని చర్చి తిరునాళ్ల



తురకపాలెం(ముప్పాళ్ల): తురకపాలెం గ్రామంలోని పునీత ఆంతోని చర్చి 122వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం వైభవంగా జరిగింది. చర్చిని విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు సామూహిక ప్రార్థనలో పాల్గొన్నారు. ఆలయ విచారణ గురువు నాగోతు చిన్నయ్య దివ్య పూజ నిర్వహించారు. అనంతరం సమష్టి దివ్యపూజాబలి నిర్వహించారు. విచారణ గురువులు జోజి రాయన్న, మల్లవరపు సుందరబాబుతో పాటు మరో పది మంది గురువులు పాల్గొన్నారు. నాగోతు శౌరిరాజు ఫాదర్‌గా 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా జూబిలీ వేడుకలు నిర్వహించారు. కొవ్వొత్తుల సమర్పణ చేశారు. సాయంత్రం తేరు ఊరేగింపు వేడుకగా జరిగింది. గ్రామ సర్పంచ్ మల్లవరపు చంద్రశేఖర్ ప్రతాప్ చిన్నారులకు బహుమతులు అందించారు.


ముగిసిన క్రికెట్ పోటీలు



క్రోసూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా క్రోసూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న కంభంపాటి, హెచ్ఎంసీసీ యూత్ క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. మొత్తం 8 జట్లు పాల్గొనగా జీఆర్ గార్డెన్స్, వైఎంసీఏ జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. ముఖ్య అతిథి, సీనియర్ క్రీడాకారుడు బండారు రాము విన్నర్స్ జీఆర్ గార్డెన్స్‌కు రూ.12 వేలు ప్రథమ బహుమతి, మెమెంటో అందజేశారు. షేక్ జాని, కంభంపాటి ఆనందరావు రన్నర్స్ వైఎంసీఏ జట్టుకు రూ.8 వేలు ద్వితీయ బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మన్నెం చంటి, రవి చౌట శ్రీను, కంభంపాటి శ్రీను, అంజి, బాజీ, శాంసన్ పాల్గొన్నారు.

భక్తుల పాలిట కల్పవృక్షం.. మల్లాది వెంకన్న

- వేడుకగా 48వ ఆలయ వార్షికోత్సవం
- 22న కనుల పండువగా కల్యాణ మహోత్సవం
- తిరునాళ్లకు భారీగా ఏర్పాట్లు



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి



మల్లాది వేంకటేశ్వరస్వామి ఆలయం

అమరావతి: మల్లాది గ్రామంలో వేంచేసిన వట వృక్షాంతర్గత వేంకటేశ్వరుడు 48 వసంతాలుగా భక్తుల పాలిట కల్పవృక్షంగా పూజలందుకుంటున్నాడు. స్వామి వారు అవతరించిన సుదినం జనవరి 22న కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించనున్నారు. సంతానప్రాప్తి, దీర్ఘకాలిక వ్యాధులు, ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం, మానసిక ప్రశాంతత కావాల్సిన భక్తులు స్వామిని దర్శించి, ఆనందంగా జీవిస్తున్నారు. సత్తెనపల్లికి చెందిన ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యేలూరి మంగాయమ్మ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ.. చెట్టు పక్కనే పద్మావతి అండాళ్ సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని నిర్మించారు. 48వ వార్షికోత్సవ తిరునాళ్లను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు యేలూరి సీతారామయ్య, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. సీతారామయ్య శుక్రవారం మాట్లాడుతూ తాత్కాలిక క్యూ లైన్‌లు, ఉచిత ప్రసాదం, తాగునీరు, అన్నదానం, పారిశుద్ధ్య నిర్వహణ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ అర్చక స్వామి వినుకొండ శ్రీనివాసాచార్యులు ఆధ్యాత్మిక కార్యక్రమాలను వివరించారు. సోమవారం 108 బిందెల కృష్ణా నది జలాలతో స్వామికి అభిషేకం, 21న నూతన వస్త్రాలంకరణ సేవ, 22న సుప్రభాత సేవ, అర్చన, గో పూజ, సప్త హారతులు, స్వామివారికి తులసీదళ సేవ నిరహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు పద్మావతి, అండాళ్ సమేత వేంకటేశ్వర స్వామికి యాజ్ఞీక బ్రహ్మ పరుచూరి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు. అన్నమాచార్య కీర్తనలు, భజన, లలిత, విష్ణు సహస్ర నామ పారాయణం, కోలాటం వంటి కార్యక్రమాలు ఉన్నాయన్నారు. సాయంత్రం 6 గంటలకు పెదశేష వాహనంపై గ్రామోత్సవం, పవళింపు సేవ నిర్వహిస్తామన్నారు. ఈ కల్యాణోత్సవంలో భక్తులందరూ పాల్గొని, స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారమేదీ!



అచ్చంపేట మెయిన్ రోడ్డులో వాహనాల రాకపోకలు

అచ్చంపేట: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. వాహనాల రద్దీ ఎక్కువైంది. రోడ్డు మార్జిన్లలో తోపుడు బండ్ల వ్యాపారాలతో పాటు.. రోడ్డు పైనే ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిలుపుదల చేయడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. ఓవర్‌లోడ్‌తో.. ఆడియో స్పీకర్ల అధిక సౌండ్‌తో ఇసుక ట్రాక్టర్లు ఎక్కువయ్యాయి. బ్యాంకుల ముందు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డు పైనే బ్యాంకు ఖాతాదారులు తమ వాహనాలను నిలుపుతున్నారు. పాఠశాల, ఉద్యోగాలకు వెళ్లి వచ్చే సమయాలు ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. సత్తెనపల్లి రోడ్డులో ఆంజనేయస్వామి విగ్రహం నుంచి పంచాయతీ ఆఫీసు వరకు, అమరావతి రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం నుంచి కొఠారు సెంటరు వరకు ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన అవసరం ఉంది. 23 గ్రామ పంచాయతీల నుంచి అచ్చంపేటకు నిత్యం రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్ కార్యాలయాలకు గ్రామస్తులు ఏదో ఒక పనిమీద వచ్చి పోతుంటారు. దీనికి తోడు ఆర్టీసీ బస్సులు కూడా సమయపాలన లేకపోవడంతో గంటల కొద్ది రోడ్డుపై ప్రయాణికులు వేచి ఉంటున్నారు. మాదిపాడు, పుట్లగూడెం బల్లకట్ల ద్వారా నిత్యం లారీలు అధిక లోడుతో వేగంగా వస్తున్నాయి. అల్పాహారం కోసం అచ్చంపేటలో సరైన స్థలం రోడ్డులోనే బస్సు నిలుపుకోవాల్సి వస్తోందని ఆర్టీసీ డ్రైవర్లు చెబుతున్నారు. రోడ్డు ఆక్రమణలు కూడా అధికంగానే ఉన్నాయి. ఇళ్ల ముందు ఉన్న స్థలం ఆక్రమించుకుని మెరకలు పోసుకోవడం, తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునేవారికి అద్దెకు ఇవ్వడం వంటి పరిస్థితులు ఎప్పటి నుంచో ఉన్నాయి. గతంలో రెవెన్యూ, పంచాయతీ, పోలీసు శాఖలు సంయుక్తంగా చర్యలు తీసుకుని, ఆక్రమణలను తొలగించినా మూడునాళ్ల ముచ్చటే అయ్యింది. తిరిగి యథావిధిగా మునుపటి పరిస్థితి కొనసాగుతోంది. ట్రాఫిక్ సమస్యను అధికారులు విస్మరిస్తే.. ఒక కానిస్టేబుల్‌ను ఉంచుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా అచ్చంపేట మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

వైద్య పరీక్షల పరిశీలన



వైద్య పరీక్షలు పరిశీలిస్తున్న ఆరోగ్య పర్యవేక్షకుడు జీవన్‌రావు

రాజుపాలెం: ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యంపై దృష్టిసారించినట్లు ఆరోగ్య పర్యవేక్షకుడు జీవన్‌రావు తెలిపారు. గతేడాది డిసెంబర్ 14 నుంచి నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్‌పై ఇంటింటా చేపడుతున్న సర్వేను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సీడీసీడీ 3.0 కార్యక్రమం రాజుపాలెంలోని పునరావాస కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి 18 ఏళ్లు పైబడిన స్త్రీ, పురుషులకు హీమోగ్లోబిన్, బీపీ, షుగర్, నోటి, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేస్తున్నట్లు తెలిపారు. 30 ఏళ్ల పైబడిన వివాహిత మహిళలకు గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్ష ఫలితాల ఆధారంగా అవసరమైన వారికి సంబంధిత వైద్య సేవలకు సిఫారసు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఆరోగ్య కార్యకర్తలు రాజ్యలక్ష్మి, తిరుపతమ్మ, ఆశ కార్యకర్తలు ప్రసన్న, రాధ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మూగజీవాలకు గడ్డు కాలం

- శీతాకాలంలో జీవాలకు, పశువులకు వ్యాధులు సోకే అవకాశం
- గొర్రెలు, మేకల పెంపకం దారులు అప్రమత్తంగా లేకుంటే నష్టం
- ముందస్తు జాగ్రత్తలు పాటించాలంటున్న పశు వైద్యుల సూచన
- జిల్లా వ్యాప్తంగా 6,25,715 గొర్రెలు, మేకలు



మేతకు వెళ్తున్న గొర్రెలు

సత్తెనపల్లి: మూగజీవాలకు శీతాకాలం గడ్డు కాలం. కొన్ని రకాల వైరస్‌లు, ఆరు బయట ఉంచడం వల్ల గొర్రెలు, మేకలు ఎక్కువగా వ్యాధుల బారిన పడుతుంటాయి. సకాలంలో వైద్యం అదించకపోతే చనిపోతుంటాయి. జిల్లాలో 6,25,715 గొర్రెలు, మేకలు ఉండగా వాటిల్లో గొర్రెలు 4,69,424, మేకలు 1,56,291 ఉన్నాయి. జీవాల ఆరోగ్యం విషయంలో పెంపకం దారులు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. పోషణతో పాటు వాటి సంరక్షణపై దృష్టి సారించాలి. వాతావరణం చల్లగా ఉండటం, మంచు కురవడం వల్ల శరీర స్థితి బాగాలేని గొర్రెలు, మేకలు ఈ కాలంలో తొందరగా వ్యాధుల బారిన పడతాయి. పారుడు, మశూచి, న్యుమోనియా, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు, దోమలు, కీటకాల వల్ల తిక్క (సర్ప) రోగం ఎక్కువగా వస్తుంది.

న్యుమోనియా

జీవాలను ఆరుబయట ఉంచడం, పాకలు పరిశుభ్రంగా లేకపోవడం, దుమ్ముధూళితో నిండి ఉండడం, పాకల్లో పరిమితికి మించి ఎక్కువ సంఖ్యలో జీవాలను ఉంచడం, సరైన పోషణ లేకపోవడం వల్ల న్యుమోనియా సోకుతుంది. ఈ వ్యాధి బారిన పడిన జీవాల్లో దగ్గు, జ్వరం, ముక్కు కారడం ఎక్కువగా కనిపిస్తుంది. సరిగ్గా మేత మేయక పోవడం వల్ల జీవాలు నీరసించిపోతాయి. ఒకటి నుంచి తొమ్మిది నెలల వయసున్న గొర్రె, మేక పిల్లలు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతుంటాయి. మరణాలు కూడా ఎక్కువగా సంభవిస్తాయి. వ్యాధి నివారణకు గాలి, వెలుతురు బాగా వచ్చే పాకల్లో జీవాలను ఉంచాలి. వాటికి సులువుగా జీర్ణమయ్యే ఆహారం, శుభ్రమైన తాగునీరు ఇవ్వాలి. పూర్తిగా వ్యాధి నుంచి కోలుకున్నాకే మందలో కలపాలి.

మశూచి/బొబ్బ రోగం:

ఈ వ్యాధి వైరస్ వల్ల ప్రబలుతుంది. వ్యాధి బారిన పడిన మేకలు, గొర్రెల చర్మంపై బొబ్బలు కనిపిస్తాయి. తీవ్ర జ్వరం వచ్చి ముక్కు నుంచి నీరు కారుతుంది. శ్వాస సరిగా ఆడక వేగంగా ఊపిరి పీల్చుతుంటాయి. వ్యాధి బారిన పడిన జీవాలను మంద నుంచి వేరు చేసి చికిత్స అందించాలి. పుండ్లపై వేప నూనె లేదా పశు వైద్యులు సూచించిన మందులను పూయాలి.

నీలి నాలుక వ్యాధి:

ప్రధానంగా ఈ వ్యాధి గొర్రెల్లో కనిపిస్తుంది. చీకటీగల ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. చలికాలంలో చీకటీగలు ఎక్కువగా వృద్ధి చెందుతుంటాయి. గాలి ద్వారా ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి చేరి వ్యాధిని వ్యాపింపజేస్తాయి. ఈ వ్యాధి సోకిన గొర్రెల్లో అధిక జ్వరం, కళ్లు, ముక్కుల నుంచి నీరు కారుతుంది. నోరు, నాలిక వాచి నీలి రంగులోకి మారుతుంది. నోటిలో పుండ్లు ఏర్పడటం వల్ల జీవాలు ఆహారం తీసుకోవడానికి ఇబ్బంది పడతాయి. కాలి గిట్టలు, చర్మం కలిసే దగ్గర వాపు వచ్చి జీవాలు కుంటుతుంటాయి. వ్యాధి ముదిరితే మరణిస్తాయి. చీకటీగలను నివారించడం ద్వారా ఈ వ్యాధిని నిర్మూలించవచ్చు. జీవాలు ఉండే పాకల దగ్గర మురుగునీరు నిలువ లేకుండా చూసుకోవాలి. వ్యాధి బారిన పడిన జీవాలను మంద నుంచి వేరుచేసి చికిత్స అందించాలి.

తిక్క (సర్ప) రోగం:

చలికాలంలో దోమలు, కీటకాల వల్ల గొర్రెలు, మేకలకు తిక్క (సర్ప)రోగం ఎక్కువగా వస్తుంది. వ్యాధిని త్వరగా గుర్తించకపోతే జీవాలు మృతి చెందే అవకాశం ఎక్కువ. పాకాల వద్ద సాయంత్రం పూట వేపాకు ధూపం వేయాలి. పాకలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలి.

తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు

- గొర్రెలు, మేకలను ఉంచే పాకల్లోకి శీతల గాలి రాకుండా చర్యలు తీసుకోవాలి.
- మంచులో, ఆరుబయట ఉంచకూడదు.
- సూర్యరశ్మి ఉన్నప్పుడే, గడ్డిపై మంచు ఆరిన తర్వాతే మేతకు విడిచి పెట్టాలి.
- ఈతకు వచ్చిన గొర్రెలను శ్రద్ధగా పర్యవేక్షించాలి.
- శరీర ఉష్ణ నిర్వహణకు పిండి పదార్థం గల మేతను అందించాలి.
- గొర్రెలను, మేకలను కట్టే ప్రదేశాలను తరచూ మారుస్తూ ఉండాలి.
- మృతి చెందిన గొర్రెలు, మేకలు తిన్న గడ్డిని, ఆహారాన్ని మిగతా వాటికి వేయకుండా కాల్చి వేయాలి.

సంరక్షణ జాగ్రత్తలు పాటించాలి

శీతాకాలంలో సాధారణంగా గొర్రెలు, మేకలకు వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. జీవాలు నీరసంగా ఉన్నా, మేత మేకపోయినా అశ్రద్ధ చేయకుండా వెంటనే పశు వైద్య సిబ్బందిని సంప్రదించాలి. వ్యాధులను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. పశు వైద్యుల సూచనలు మేరకు మందులు వాడుతూ సంరక్షణ జాగ్రత్తలు పాటించాలి.

–డాక్టర్ మంగు శ్రీనివాసరావు, ఏడీ, పశుసంవర్ధక శాఖ, సత్తెనపల్లి

సాగర్ కాలువలో పడి వృద్ధురాలి మృతి

నాదెండ్ల: ప్రమాదవశాత్తు కాలుజారి సాగర్ కాల్వలో పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సాతులూరు సమీపంలోని పెదనందిపాడు మేజర్‌కాలువ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై జి.పుల్లారావు కథనం ప్రకారం.. కాలువలో వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతురాలు పొనుగుపాడు గ్రామానికి చెందిన అత్తోట పూర్ణమ్మ (75)గా గుర్తించారు. ఆమెకు నలుగురు కుమార్తెలు. భర్త, ముగ్గురు కుమార్తెలు కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. మూడో కుమార్తె సీతమ్మ వద్ద పొనుగుపాడు గ్రామంలో నివశిస్తోంది. ఆస్తమాతో బాధపడుతున్న పూర్ణమ్మ శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఆసుపత్రికి వెళ్ళేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. అయితే కాలువలో నీరు తాగే క్రమంలో కాలుజారి పడిపోయి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమార్తె సీతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

నరసరావుపేట రూరల్: రహదారి భద్రతా నియమాలు వాహనచోదకులు తప్పనిసరిగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శివనాగేశ్వరరావు తెలిపారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆర్టీవో కార్యాలయంలో శుక్రవారం భారీ వాహన డ్రైవర్లకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవీఐలు ఎస్.శ్రావ్య,ఎంఎల్ఎన్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25439 (సత్తెనపల్లి)
90100 01840 (పెదకూరపాడు)
Office mail : sakshigntadvt@gmail.com